# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఏపీపీఎస్సీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ ఈ నెల 27వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.
- ❖ "సి-విజిల్" యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వంద నిమిషాల్లో స్పందిస్తామని విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ వెల్లడించారు.
- ❖ ఈఏపీసెట్ ను మే 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ తెలిపారు.
- ❖ రానున్న 48 గంటల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

======================

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్ష రద్దుపై ఈ రోజు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై తాత్కాలిక స్టే విధిస్తూ ప్రస్తుతం ఉద్యోగాల్లో ఉన్నవాళ్లు యధావిధిగా కొనసాగుతారని డివిజన్ బెంచ్ ఊరట ఇచ్చింది. ఏపీపీఎస్సీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ ఈ నెల 27వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

======================

సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రచారాలకు, ర్యాలీలకు అనుమతులు ఇచ్చే అధికారం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లదేనని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అన్నారు. డోర్ టూ డోర్ ప్రచారానికి కూడా అనుమతులు ఆర్వో నుంచి పొందాలని, దానికి "సువిధ" యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 63 బృందాలు విధుల్లో వుంటాయని, అలాగే "సి-విజిల్" యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తమ బృందాలు వంద నిమిషాల్లో స్పందిస్తాయని ఆయన వెల్లడించారు.

=======================

ఈఏపీసెట్ ను మే 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటించిన షెడ్యూల్ మేరకు మే 13వ తేదీ పోలింగ్ వుండటంతో షెడ్యూల్ ను సవరించామని పేర్కొన్నారు. వ్యవసాయ, ఫార్మసీ అభ్యర్థులకు మే 16, 17 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని, ఇంజినీరింగ్ విద్యార్థులకు మే 18, 19న ఒక్కో విడత చొప్పున నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ ప్రక్రియ 22 వరకు కొనసాగుతుందని అన్నారు. ఏపీ పీజీసెట్ ను జూన్ 10కి మార్చామని, జూన్ 14 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

=======================

ఆంధ్ర ప్రదేశ్, యానం దిగువ ట్రోపో  ఆవరణంలో ఆగ్నేయ, దక్షిణ గాలులు వీస్తున్నాయని, దీని ప్రభావంతో రానున్న 48 గంటల్లో ఉత్తర దక్షిణ కోస్తాంధ్రా జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే ఉరుములు లేదా మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే  అవకాశముందని పేర్కొంది.

=======================

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం తమ బాధ్యత అని విశాఖపట్నం పోలీస్ రేంజ్ డి.ఐ.జి  విశాల్ గున్ని అన్నారు. ఈ రోజు శ్రీకాకుళం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కూంబింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొంటూ…

(వాయిస్ 28 సెకన్లు)

=======================

ఎన్నికల సంఘం నుంచి స్పష్టత వచ్చిన తర్వాతే టెట్ ఫలితాలు వెల్లడిస్తామని విద్యా శాఖ ఒక ప్రకటనలో  తెలిపింది. మార్చి 14వ తేదీనే టెట్ ఫలితాలు వెల్లడి కావల్సి ఉందని, మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎలక్షన్ కమీషన్ నుంచి అనుమతి రాగానే ఫలితాలు విడుదల చేస్తామని విద్యా శాఖ అధికారులు పేర్కొన్నారు.

విరామం

=======================

ప్రతి సంవత్సరం మార్చి 21వ తేదీన ప్రపంచ అటవీ దినోత్సవం జరుపుకుంటున్నాము. 2012 నవంబరు 28న యునెస్కో ప్రపంచ అటవీ దినోత్సవంను ప్రకటించగా, 2013 మార్చి 21వ తేదీన తొలిసారిగా నిర్వహించారు. అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియజేయడం కోసం ప్రతీ సంవత్సరం ఒక్కో ఇతివృత్తంతో  వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది. ఈ సంవత్సరం  'అడవులు ఆవిష్కరణలు" థీమ్ తో అంతర్జాతీయ అటవీ దినోత్సవం జరుపుకుంటున్నాము. స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం, వనరులను అందించడం, కాగితం వినియోగాన్ని తగ్గించడం వంటి ఎన్నో అంశాలను పొందుపరిచారు. ప్రభుత్వ సంస్థలు, ఎన్ జి వో లు, స్థానిక సంఘాలు వంటి వివిధ వాటాదారులను ఈ సందర్భంగా ప్రోత్సహిస్తారు. అలాగే ప్రపంచ స్థాయి వాతావరణాన్ని నియంత్రించడం, జీవవైవిధ్య నష్టం, భూమి క్షీణత వంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. రాబోయే తరాలకు పర్యావరణ వ్యవస్థలను రక్షించడానికి సంఘాలు ఏకమవుతాయని ఆశిద్దాం.

======================

ఆర్థిక స్థోమత లేని  జైలులో ఉన్న అనేక మంది ఖైదీలకు ఉచిత న్యాయసలహా సహాయం అందించేదుకు శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానంలో  ఉచిత లీగల్ సెల్ ఏర్పాటు చేశామని జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి ఎం. సన్యాసి నాయుడు తెలిపారు. ఈ రోజు శ్రీకాకుళంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, క్రిమినల్ కేసుల్లో వున్న  నిరుపేదలకు బడుగు బలహీనవర్గాలకు తమ వంతు సహాయం అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఖైదీలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

======================

ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు ప్రచారం చేయారాదని అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఈ విధమైన ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామనీ పేర్కొన్నారు.

======================

సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా జిల్లాలో బోర్డర్ చెక్ పోస్టులలో వాహనాలను తనిఖీలు చేస్తున్నామని శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎ.మాధవ్ రెడ్డి  తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో పాటు స్థానిక పోలీసులు, అన్ని మండల కేంద్రాల్లో, బోర్డర్ చెక్ పోస్టుల వద్ద ప్రతి  వాహనాన్ని తనిఖీలు చేస్తున్నారని వెల్లడించారు.

======================

తిరుపతి జిల్లాకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదామును ఈరోజు జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తనిఖీ చేశారు. ఈ సందర్శంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,  ఎన్నికల విధులకు హాజరయ్యే పి.ఓ, ఏపిఓల శిక్షణ కోసం వివిప్యాట్ లను వినియోగిస్తున్నామని చెప్పారు. గోడౌన్ వద్ద భద్రతా ఏర్పాట్లు, సిసి కెమెరాలను కలెక్టర్ ఈ సంధర్భంగా పరిశీలించారు. బందోబస్తును 24 గంటల పాటు యధావిధిగా కొనసాగించాలని అధికారులకు సూచించారు.

======================

ఈ రోజు  శ్రీవారి ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేశారు. జూన్ 19 నుండి 21వ తేదీ వరకు జరుగనున్న జ్యేష్టాభిషేకం ఉత్సవంలో పాల్గొనేందుకు ఈ రోజు ఉదయం 10 గంటలకు భక్తులకు టికెట్లను అందుబాటులో వుంచారు. అలాగే ఈనెల 23వ తేదీన  ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు అందుబాటులోకి తెస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలియజేశారు.

======================

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని నారా కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఈరోజు ఉదయం విఐపీ విరామ సమయంలో తెలుగు దేశం పార్టీ నేత నారా లోకేష్,  నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి, దేవాన్ష్ లు స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. టిటిడి అన్నప్రసాద ట్రస్ట్ కు 38 లక్షల రూపాయల విరాళం కుటుంబ సభ్యులు అందజేశారు.

======================

ఎన్నికల పర్యవేక్షణ నిమిత్తం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ప్రకాశం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ను

ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కంట్రోల్ రూమ్ లో 14 మంది నోడల్ ఆఫీసర్లు 24 గంటల పాటు అందుబాటులో వుంచామని, వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. రాజకీయ పక్షాలు నిర్వహించే ర్యాలీలు, సమావేశాలలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు.

=======================

ఎన్నికల విధుల నుండి మినహాయింపు కోరుకున్న బోధన, బోధనేతర ఉద్యోగులు వెంటనే సరైన ఆధారాలు సమర్పించాలని శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ, మినహాయింపు కోరుతున్న ఉద్యోగుల జాబితా సిద్ధం అవుతున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను డి ఈ ఓ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

=======================

రబీ సీజన్ లో రైతు పండించిన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. భీమవరంలో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

=======================

=======================